# భగ్న హృదయం

రా సీతా! లోపలికి రా.

అదేమిటే గుమ్మంలోనే ఆగిపోయావు. అలా వింతగా చూస్తావేం నన్ను.

అప్పటికీ ఇప్పటికీ మారిపోయానంటావా! అవును లే అలాగే అనుకో!

సంవత్సరన్నర క్రితము బెజవాడ స్టేషన్లో కలుసుకున్నాం గదూ! తర్వాత మళ్ళీ ఈ రోజున యిలా అకస్మాత్తుగా—అదేమిటి సీతా! వచ్చినప్పటినుండి అలా విచిత్రంగా చూస్తున్నావు నన్ను. పూర్వపు పద్మని కానా నేను.

చాలా చిక్కిపోయా నంటావా!

ఏం చేసేది సీతా! పరిస్థితులు అలాగ చేసినవి. అంతా అయోమయంగా వుంది.

స్కూల్ ఫైనల్ పరీక్ష ప్యాసైనావని ఆ రోజు బెజవాడ స్టేషన్లో కలిసినప్పుడు చెప్పాను. అప్పుడు సరిగా మాట్లాడుకోవటానికే వ్యవధి లేకపోయింది.

కాలేజీలో ఎందుకు చేరలేదని అడుగుతున్నావా?

మా పరిస్థితులు నీకు తెలీనివా సీతా! మా నాన్న గారికి వచ్చే నెల జీతం పిల్లల చదువులకి, ఇంటి అద్దెలకి, యింకా మిగతా ఖర్చుల కేమి సరిపోతుంది చెప్పు. పోనీ నేను వుద్యోగం చేస్తాను, ఇంతటితో నా చదువు ఆపివేస్తాను అంటే చదువు ఆపేసే సంగతితో నీ యిష్టము వచ్చినట్లు చెయ్యి కానీ వుద్యోగము మాత్రం చెయ్యటానికి వీలులేదు అన్నారు.

సీతా! నేను వుద్యోగం చేస్తే తప్పా! ఉద్యోగం వుంటే ఎవ్వ రేనుకున్నా కలిగే నష్టము ఏమిటి సీతా! పోనీ ఎదిగిన పిల్లలు గదా? పెళ్ళి చేద్దామని ఏమైనా వుందా? అది అసలు చేతకాదంటారు. అయినా మాలాంటి వాళ్ళు పెళ్ళిళ్ళు చెయ్యాలంటే సాధ్యమా! వరకట్న నిషేధం అని చట్టం ప్రవేశ పెట్టారు గాని ఆడపడుచుల లాంచనాలు, పెండ్లి కొడుకుల అలకలు తీర్చేసరికి కట్నంకంటే ఎక్కువే తేలుతుంది. ప్రతి మగవాడు అందమైన యువతుల్నే చేసుకుంటా మంటే మరి మధ్యస్థంగా వున్న మాలాటి వాళ్ళ గతేం కావాలి? ఇంకా అధోగతి వాళ్ళ సంగతేం కావాలి చెప్పు!

నీ కేం సీతా! నువ్వు అదృష్టవంతురాలివి. మీ వాళ్ళు అందచందాలతో నిమిత్తం లేకుండా బంధుత్వాన్ని విడదీసుకోకుండా మీ బావకి, నీకు పెళ్ళి చేశారు.

మా బావ సంగతా అడుగుతున్నావు?

అత నెక్కడ సీతా! నక్క ఎక్కడా, నాగలోక మెక్కడా అన్న సామెతలే. వాళ్ళకి అరవై ఎకరాల భూమి వుంది. మా సంగతా నీకు తెలిసిందే. అలాంటప్పుడు వాళ్ళకీ, మాకూ ఎలా పొత్తు కుదురుతుంది?

అయినా మావాళ్ళు అతన్ని అడిగారులే!

ఏ మన్నారని అడుగుతున్నావా!

అతనికి ఒక మేనకోడ లుందిలే. ఆ పిల్లని చేసుకొంటే మా వాళ్ళకి కోపం వస్తుందనీ, నన్ను గాని మా అక్కయ్యని గాని చేసుకొంటే అదవాళ్ళకి కోపం వస్తుందనీ పరాయి సంబంధాలకోసం ప్రయత్నిస్తున్నారు.

మా విషయంలో అడిగితే తనకి మంచి సాంప్రదాయపు కుటుంబములోని పిల్ల కావా లన్నాడట.

అయితే సీతా! మాకు మీకు పాతి కేళ్ళ పైగా పరిచయ ముందట కదా! ఏనాడైనా మా వాళ్ళు మమ్ములని గూర్చి చెడుగా చెప్పుకోవటం విన్నావా?

అతని దృష్టిలో ఆస్తిపాస్తులు లేనివాళ్ళు, మంచి సాంప్రదాయం కలవాళ్ళు కాదు గాబోలు.

ఏమిటో సీతా! నాకు ప్రపంచ జ్ఞానము తెలిసినప్పటి నుంచి బావ నావాడే అనుకున్నాను. నేను కట్టుకున్న గాలి మేడలు యిలా కూలిపోతాయని అనుకోలేదు సీతా! బావ మమ్ములను యిలా భగ్నహృదయుల్ని గావిస్తాడని కల్లోగూడ నమ్మలేదు సీతా! ఎప్పటికైనా అతనికి నా మీద జాలి కలిగకపోతుందా అనే ఆశతో బ్రతుకుతున్నాను.

ఏం సీతా! టైమెంతయిందో నవా నీ అరాటం. ఆరున్నర అయివుంటుంది.

అప్పుడే వెళ్తా నంటున్నావేం సీతా! నా సోదితో నీకు విసుగ్గా వుందనుకుంటాను. నీలాగ వోపిగ్గా వినే వాళ్ళు ఎవరున్నారు చెప్పు.

చిన్నప్పటినుంచి కలిసి మెలిసి వున్నాము. ఒకచోటే పెరిగి, ఒక చోటనే చదువుకున్నాము. మన యిద్దరి అభిరుచులు ఒక్కటవటము వలననే మన మిద్దరము ఎంతో ఆప్త మిత్రుల మయినాము. కాని విధి మనలను వేరు చేసింది. ఆనాటి మన రోజుల్ని తలచుకుంటే అప్పుడే ఇంత పెద్దవాళ్ళ మెందుకైనామా! అనిపిస్తుంది సీతా!

వచ్చి కాస్సేపైనా కాలేదు. అప్పుడే [illegible] నంటున్నావు. బొట్టు పెడ్తానుండు సీతా....

ఎప్పుడైనా ఈ వూరొస్తే యిలాగే వచ్చిపోతూ వుండు. మరచిపోకేం! ★



బ్రాంచీలు: హైదరాబాద్, విజయవాడ.
యునైటెడ్ కన్సర్న్స్, మద్రాసు—1.

## రచయితలకు మనవి

"ఆంధ్రప్రభ" సచిత్ర వార పత్రికలో ప్రచురణార్థం రచనలు, చిత్రాలు, ఫోటోలు పంపేవారు ఈ క్రింది విషయాలను గమనించ గోరుతున్నాము.

1. రచనలలో చివరి పేజీ లందే చిరునామాలను సహితం వ్రాసిపంపాలి. చిత్రాలు, ఫోటోలు అయినచో ప్రతిదానికి వెనుక ప్రక్కనే విలాసాలు వ్రాయాలి. ప్రత్యేకంగా చీటీలలో విలాసాలు వ్రాసినవి జారిపోతున్నవి గనుక పై సూచనను పాటించగోరుతున్నాము.

2. ప్రచురణ కాని రచనలను, చిత్రాలను, ఫోటోలను త్రిప్పి పంపాలని కోరేవారు ప్రత్యేకంగా కార్డులు వ్రాయ నవసరంలేదు. వాటితోపాటే బుక్ పోస్టులకు చాలినన్ని స్టాంపులు పెట్టిపంపితే చాలు. ప్రచురించేపట్ల ఆ స్టాంపులను ఉపయోగించి ఆ విషయాన్ని తెలుపుతాము. స్టాంపులు పంపనియెడల త్రిప్పి పంపడం సాధ్యపడదు.

3. ఏ విషయం తెలుపడానికైనా నాలుగైదు వారాలు పట్ట వచ్చు.

రచయితలు ఈ విషయాలు మనసులో ఉంచుకొని మాతో సహకరించాలని కోరుతున్నాము.

—ఎడిటర్